ఎమ్మెల్యేకి శుభాకాంక్షల వెల్లువ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం దసరా శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. ఈ నెల 6న తన పుట్టిన రోజును ఎలాంటి హంగూ, ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా జరపుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. నేతలు, కార్యకర్తలు తమ డివిజన్‌ల్లో పేదలకు అన్నదానం, హాస్పటల్స్, వృద్ధులు, అనాథాశ్రమాల్లో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

అమీర్‌పేట: సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ నాయకులు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వెస్ట్‌మారెడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషకుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుపు ఖాయం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీదే గెలుపని, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ ప్రగతిని చూపి ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి రామ్మోహన్‌రావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో బీజేపీ చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ శనివారం ప్రచారం నిర్వహించారు. జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజానీకం, వ్యాపార సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల వచ్చిన మార్పులను వివరిస్తూ స్టిక్కర్లను అతికించారు.

అడవిని తలపిస్తున్న ఆస్పత్రి పార్కు



లాలాపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రం పార్కు దుస్థితి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న పార్కు పూర్తిగా దట్టమైన అడవిని తలపిస్తుంది. హాస్పిటల్‌లోని ఇన్‌పేషంట్లు వాకింగ్ చేయడానికి, పేషంట్ల బంధువులు వేచి ఉండేందుకు ఆకుపచ్చని గడ్డి, పూల మొక్కలతో వాటి మధ్య సిమెంట్ బెంచీలతో, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లతో పార్కు దర్శనం ఇస్తుంది. దీంతో ఈ పార్కు నిరుపయోగంగా తయారైంది. కొంత కాలంగా హాస్పిటల్‌కు పూర్తిస్థాయి అధికారి సూపరింటెండెంట్ లేకపోవడంతో హాస్పిటల్ నిర్వాహణ పూర్తిగా కుంటుపడింది. ఇక్కడ గర్భిణులు వివిధ పరీక్షల నిమిత్తం, ప్రసవాల కోసం వైద్యం కోసం వస్తుంటారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో పేషంట్లు వాకింగ్ చేసుకోలేకపోతున్నారు. కొందరు ఇన్‌పేషంట్లుగా సైతం రోజుల తరబడి వైద్యం తీసుకుంటారు. హాస్పిటల్ చుట్టూ దట్టమైన చెట్లు, పిచ్చి మొక్కలు క్రిమి కీటకాలకు స్థావరంగా మారింది. హాస్పిటల్ కిటికీలకు కనీసం దోమ తెరలు సైతం లేకపోవడంతో రాత్రి వేళల్లో దోమలు విజృంభిస్తున్నాయి. ఇన్‌పేషంట్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇన్‌పేషంట్లు, అటెండర్లు రోడ్లపై వేచి ఉండాల్సి వస్తుంది. ఈ విషయమై హాస్పిటల్ ఇన్‌చార్జి అధికారులను వివరణ కోరగా, హాస్పిటల్ పార్కు నిర్వాహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని తమ ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు రాత పూర్వకంగా విన్నవించామన్నారు.

పోలీసులను దూషించినందుకు ఒకటి..

మద్యం మత్తులో ప్రహరీ ఢీకొట్టినందుకు మరొకటి

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ అదుపు తప్పి ఓ ఇంటిని ఢీకొట్టడమే కాకుండా స్టేషన్‌కు తీసుకువచ్చిన తర్వాత పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. అమీన్‌పూర్‌కు చెందిన పెద్దింటి సందీప్‌రెడ్డి(33) తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో తన కారులో మద్యం తాగి అదుపు తప్పిన వేగంతో ప్రశాసన్‌నగర్‌లో దూసుకెళ్తుండగా కారు అదుపుతప్పి ఓ రిటైర్డ్ అధికారి ఇంటిని ఢీకొట్టాడు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, ఇంటి ప్రహరీతో పాటు మొక్కలు ధ్వంసమయ్యాయి. బాధితుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు సందీప్‌రెడ్డిని స్టేషన్‌కు తీసుకువచ్చి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా పీకలదాకా మద్యం తాగినట్లు తేలింది. మద్యం మత్తులో పోలీసులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఇంటి ప్రహరీని ఢీకొట్టిన కేసుతో పాటు పోలీసులను దూషించినందుకు మరో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

- సనత్‌నగర్–బాలానగర్ రహదారి నిర్మాణానికి గ్రహణం
- ఎట్టకేలకు అండర్‌పాస్ నిర్మాణ పనుల్లో కదలిక
- రోడ్డు విస్తరణ ఊసెత్తని అధికారులు
- ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న వైనం



విస్తరణ చేపట్టాల్సిన సనత్‌నగర్ ఇండస్ట్రియల్ రహదారి



విస్తరణ అంశాన్ని పట్టించుకోకుండా కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ఫతేనగర్ వైపు కొనసాగుతున్న అండర్‌పాస్ నిర్మాణ పనులు

సనత్‌నగర్: రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా నుంచి రైలు పట్టాల కిందుగా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాకు అనుసంధానం చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.68.30 కోట్లు మంజూరు చేయగా, సుమారు రూ.40 కోట్ల మేర రైలు పట్టాలు కిందుగా 600 మీటర్ల పొడవున అండర్‌పాస్ నిర్మించడం కోసం రైల్వేశాఖకు కేటాయించారు. జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు అందుకున్న రైల్వేశాఖ రెండేళ్ల అనంతరం ఎట్టకేలకు పనులు చేపట్టింది. రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా బాక్సులు ఏర్పాటు చేసి, అండర్‌పాస్ మార్గాన్ని సుగమం చేసే దిశగా పనులు కొనసాగుతున్నాయి. ఇదంతా బాగానే ఉన్నా 600 మీటర్ల రైల్వే అండర్‌పాస్ నిర్మాణం మినహాయించి సనత్‌నగర్–బాలానగర్ నర్సాపూర్ రహదారి వరకు ఉన్న మిగతా రెండు కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. అప్పుడే పూర్తి ప్రాజెక్టుకు సార్థకత చేకూరుతుంది. రోడ్డును అభివృద్ధి చేసే బాధ్యతను హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వర్తించాల్సి ఉంది. అయితే కార్పొరేషన్ ఆ దిశగా చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు.

ప్రాజెక్టు ముందుకు కదులుతుందా?

◆ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా ఈ ప్రాజెక్టు ముందుకు కదులుతుందా? అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే ఒక వైపు అండర్‌పాస్ నిర్మాణంలో భాగంగా బాక్స్‌ల ఏర్పాటు పనులు జరుగుతుండగా, మరోవైపు మిగతా రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉండగా, అవేమీ పట్టనట్లు విద్యుత్ శాఖ అధికారులు కొత్త స్తంభాల ఏర్పాటు చేయడం గమనార్హం. నాలుగు లేన్ల రహదారిగా దీనిని తీర్చిదిద్దే క్రమంలో రోడ్డుకి ఇరువైపులా కొన్ని ఆస్తులను స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎక్కడ ఎంతమేర స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్న దానిపై కొలతలు వేసి మార్కింగ్‌లు కూడా వేశారు. ఆ మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలను కూడా షిఫ్టు చేయాలి. ఆ ఆలోచన కూడా లేకుండా ఎలక్ట్రికల్ అధికారులు ఆ మార్గంలో ఉన్న ఐరన్ స్తంభాలను తొలగిస్తూ అదే చోట సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. పాత వాటి స్థానంలో కొత్తగా వేస్తున్న సిమెంట్ స్తంభాలు రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉంటాయన్న విషయాన్ని కూడా పక్కనబెట్టి ఆగమేఘాలపై విద్యుత్ అధికారులు స్తంభాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేస్తున్న కరెంటు స్తంభాలను రోడ్డు విస్తరణ సమయంలో షిఫ్టు చేయడం అనివార్యమే అవుతోంది. ఎందుకంటే స్తంభాలను దాటుకొని ప్రైవేట్ ఆస్తులను కూడా స్వాధీనం చేసుకుంటున్న అధికారులు, అదే స్తంభాలను షిఫ్టు చేయించాల్సిన పరిస్థితులు తప్పవు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంగా వ్యవహరించి రోడ్డు విస్తరణ తర్వాత కొత్తగా కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేయడం ద్వారా నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్నది సుస్పష్టం. ఇదిలా ఉంటే గత ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించే క్రమంలో ఫతేనగర్ నుంచి భారీ పైప్‌లైన్ల నిర్మాణాన్ని రైలు పట్టాల కిందుగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పైప్‌లైన్లు కూడా తొలగించాల్సి ఉంటుంది.

ఈ ప్రాజెక్టుతో ఎన్నో ప్రయోజనాలు..

◆ సికింద్రాబాద్–ముంబాయి లైన్‌లో ఉన్న ఏడు రైలు పట్టాల కింద నుంచి సనత్‌నగర్ బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాను కలిపేలా అండర్‌పాస్ నిర్మాణాన్ని చేపడతారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఎర్రగడ్డ నుంచి బాలానగర్‌కు 10 నిమిషాల లోపే చేరుకోవచ్చు. అలాగే సనత్‌నగర్ నుంచి నర్సాపూర్ చౌరస్తాకు ఐదు నిమిషాల్లో చేరుకోవచ్చు. మరోవైపు జాతీయ రహదారిపై రద్దీ కూడా తగ్గుతోంది. ఇరుకైన ఫతేనగర్ నుంచి వాహనాల రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది.

నిబంధనలతోనే గుమ్మడికాయల విక్రయాలు

మార్కెట్ కమిటీ స్పష్టీకరణ



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, సెక్రెటరీ వెంకన్న

కంటోన్మెంట్: దసరాను పురస్కరించుకొని బోయిన్‌పల్లిలోని బీఆర్ అంబేడ్కర్ మార్కెట్ యార్డులో నిబంధనల మేరకే గుమ్మడికాయల క్రయ, విక్రయాలు జరిగాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకన్న స్పష్టం చేశారు. గుమ్మడికాయల క్రయ, విక్రయాలకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఈ మేరకు ఆన్‌లైన్ పత్రికల్లో వచ్చిన అబద్ధపు కథనాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కమిషన్ ఏజెంట్‌లతో కలిసి మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... దసరా సందర్భంగా గుమ్మడి కాయల విక్రయాలు భారీగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో యార్డు ఆవరణలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో రోడ్లు, ఖాళీ ప్రదేశాలపై గుమ్మడికాయల విక్రయాలు చేపట్టొద్దని, వ్యాపారులకు ముందుగానే సూచించామన్నారు. వ్యాపారులు తమ షాపుల ముందే వాహనాలు నిలుపుకొని అమ్మకాలు సాగించినట్లు తెలిపారు. గుమ్మడికాయల విక్రయాలకు సంబంధించి తమ నుంచి ఎవరూ వసూళ్లకు పాల్పడలేదని కమిషన్ ఏజెంట్‌ల సంఘం చైర్మన్ దేవేందర్ రెడ్డి వివరించారు. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు ప్రతిష్టను దెబ్బతీసే కథనాలపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

అడ్డగుట్ట: పేదప్రజలను ఆపద సమయాల్లో ఆదుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుంటారని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ అన్నారు. ఇటీవల తుకారాంగేట్‌లో ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఇంట్లోని సామగ్రితో పాటు కొంత డబ్బు కూడా దగ్ధమైంది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ బాధితులకు తమవంతు సహాయంగా రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శనివారం కాంగ్రెస్ నాయకులు డబ్బులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొమ్మాటి శివకుమార్, అనంత కృష్ణ, ప్రభాకర్, సురేశ్, నవీన్, హరి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు ఉపాధ్యాయుల బృందం



లాలాపేట: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) హైదరాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు శనివారం జాతీయ మహాసభలకు పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి జైపూర్‌కు తరలివెళ్లారు. ఈ మేరకు తపస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. తిరుపతిరెడ్డి, వీరేశ్ మాట్లాడుతూ.. కేంద్ర సంస్థ అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 5,6,7 తేదీల్లో రాజస్థాన్ జైపూర్‌లో 9వ జాతీయ మహా సభలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ సభల్లో పాల్గొనడానికి హైదరాబాద్ జిల్లా నుంచి దాదాపు 13 ఉపాధ్యాయుల బృందం బయలుదేరి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, దేశాన్ని సమున్నత స్థితిలో నిలపడం కోసం ఉపాధ్యాయులు నిర్వర్తించాల్సిన కృషి తదితర అంశాలపై దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులతో ఈ సభల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన ప్రతిపాదనలు అందజేస్తారని అన్నారు. జైపూర్‌కు వెళ్లిన వారిలో వీరేశ్, లక్ష్మీనారాయణ, వీరకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రజనీదేవి, మంజుల, అనురాధ, సీహెచ్ జ్యోతి, సునీత రాణి, కరుణశ్రీ, ఇందిరా, ఏ జ్యోతి, సురేఖా బాయి తదితరులు ఉన్నారు.

5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సామికా



బన్సీలాల్‌పేట్: కష్టపడితే అసాధ్యం అంటూ ఏమీ ఉండదని.. చదువుతోనే అనుకున్నది సాధించవచ్చని నిరూపించింది సామికా. పోటీ ప్రపంచంలో కష్టపడి ఏకంగా 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, గ్రూమ్ 2, 3 లతో పాటు గ్రూప్ 4 కూడా సాధించింది. బన్సీలాల్‌పేట్ నివాసి రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి వైఎం. విజయ్‌కుమార్, ప్రభావతి దంపతుల కుమార్తె వై. సామికా అయిదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఆమె సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో ఎస్‌ఎస్‌సీ ఇంటర్‌తో పాటు బేగంపేట్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఏంఏ పూర్తి చేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నది. త్వరలో రెవెన్యూ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు సహకారం, ప్రోత్సాహంతో కష్టపడి, అంకితభావంతో చదివితే ఏ రంగంలోనైనా మంచి ఫలితాలను వస్తాయన్నారు. 5ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సామికాను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శాలువతో అభినందించారు. ఆమె ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ద్వారా యువతకు ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

నిమ్స్‌కు వీల్ చైర్ల వితరణ

ఐదు వీల్‌చైర్లను అందజేసిన డాక్టర్ ఉషారాణి

లక్డీకాపూల్: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)కు చెందిన ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన ఫార్మకాలజీ విభాగాధిపతి పి.ఉషారాణి ఆస్పత్రికి ఐదు వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు. సోమవారం వీటిని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉషారాణికి కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్‌కు వచ్చే రోగులకు ఉపయోగపడే విధంగా వీల్ చైర్లను అందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.లక్ష్మీ భాస్కర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డా.చరణ్, ఆర్ఎంఓ సయ్యద్ సల్మాన్, డా.పద్మజ, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరం దాస్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బేగంపేటలో విద్యుత్ అధికారుల బస్తీ బాట



బేగంపేట బ్రాహ్మణవాడీలో బస్తీబాటలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు

సనత్‌నగర్: విద్యుత్ అధికారుల బస్తీబాట కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం బేగంపేట బ్రాహ్మణవాడీలో పర్యటించారు. టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) నర్సింహులు, మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, బంజారాహిల్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కరుణాకర్‌బాబు, గ్రీన్‌ల్యాండ్స్ డివిజనల్ ఇంజనీర్ భీమా నాయక్, గ్రీన్‌ల్యాండ్స్, బేగంపేట ఏఈలు కిషోర్ కుమార్, సాయికుమార్‌లు ఈ పర్యటనలో పాల్గొని క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విద్యుత్ సంబంధిత సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వినియోగదారులతో సమావేశం కాగా పలువురు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెనువెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీనిచ్చారు. ఎక్కడైతే బేర్ కండక్టర్లు ఉన్నాయో ఆ ప్రాంతాల్లో వాటిని ఏబీ కేబుల్స్‌గా మార్చాలని డైరెక్ట సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని వినియోగదారులను కోరారు. బస్తీ బాట కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి వారి సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక నేతలు కూన గౌరీశంకర్‌గౌడ్, షరీపుద్దీన్, మునీర్‌ఖాన్‌ల సమక్షంలో పలువురు వినియోగదారులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు.

తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా మహేందర్



చిలకలగూడ: తెలంగాణ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన బండారి మహేందర్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియామకపత్రాలను అందించారు. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు జాగృతి కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో నూతన అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో తెలంగాణ జాగృతిని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. మహిళలు, యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి తెలంగాణ జాగృతిలో సభ్యత్వంతో పాటు సమకాలీన రాజకీయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా పరిధిలో నియోజకవర్గ, డివిజన్ కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. బడుగు, బలహీనవర్గాలు, నిరుపేదల పక్షాన పోరాడి వారికి అన్నివిధాల అండదండగా తెలంగాణ జాగృతి ఉంటుందని స్పష్టం చేశారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావంతో పాటు తెలంగాణ ఉద్యమ సమయంలో మహేందర్ ముదిరాజ్ క్రియాశీలకంగా వ్యవహరించారు. తనపై నమ్మకంతో పదవీబాధ్యతలు అప్పగించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సుభిక్షం

చిలకలగూడ: అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సుభిక్షంగా ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం పాడిపంటలతో సమృద్ధిగా ఉందని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని అన్నారు.



చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండప నిర్వాహకులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

బేగంపేటలో అధ్వానంగా పారిశుద్ధ్యం



బేగంపేట ప్రకాష్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం, వ్యర్థాలు

సనత్‌నగర్: బేగంపేటలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా ప్రకాష్‌నగర్‌లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రతిరోజూ గార్బేజ్ వల్లరబుల్ పాయింట్ల (జీవీపీ) నుంచి చెత్తను తరలించాల్సి ఉండగా, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలే వర్షాకాలం.. ఆపై చెత్తకుప్పలు, వ్యర్థాలు పేరుకుపోవడంతో అనారోగ్యకర వాతావరణం రాజ్యమేలుతోంది. ఇంకోవైపు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నుంచి పొంగిపొర్లుతూ రోడ్లపై మురుగు ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. ఒకవైపు బేగంపేట ఎయిర్‌పోర్ట్ వేదికగా వీవీఐపీలు రాకపోకలు సాగిస్తుంటే, దీనికి కూతవేటు దూరంలో ఉన్న ప్రకాష్‌నగర్‌లో పారిశుద్ధ్య సమస్య విలయతాండవం చేయడంపై అధికారుల తీరుపై స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రకాష్‌నగర్‌కాలనీ ఏషన్ షాపు వెనక లైన్‌లో డ్రైనేజీ పొంగుతూ ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. పారిశుద్ధ్య సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా శాశ్వత పరిష్కారం గురించి ఆలోచించడం లేదని వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించడంతో పాటు వాటర్‌వర్క్స్ అధికారులు పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లపై దృష్టిసారించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో రోగాలబారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు

గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి



జీఎంసీ ప్లాజా క్యాంటిన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, ఆర్ఎంఓలు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఫుడ్ క్యాంటిన్ల యాజమాన్యాలు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి హెచ్చరించారు. ఆస్పత్రి పాలన యంత్రాంగంతో కలిసి గాంధీ ప్రాంగణంలోని క్యాంటిన్లలో శనివారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా ఫుడ్ క్యాంటిన్ల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. జయశంకర్ విగ్రహం ఎదురుగా ఉన్న జీఎంసీ ప్లాజా క్యాంటిన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. నిల్వ ఉంచిన పలురకాల పండ్ల రసాలు, పాల ప్యాకెట్లను పరిశీలించి క్యాంటిన్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, లైసెన్స్ క్యాన్సిల్ చేస్తామని హెచ్చరించారు. ఆస్పత్రి వైద్యసిబ్బంది, రోగులు, రోగి సహాయకులు తినే ఆహారపదార్థాలు నాణ్యతతో ఉండాలని లేకుంటే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని అన్నారు. జీఎంసీ ప్లాజా క్యాంటిన్‌లో ఫ్రూట్ జ్యూస్ సెంటర్ నిర్వహణకు అనుమతిలేదని, ఓపీ ఎదురుగా ఉన్న ఫెషీ క్యాంటిన్ కాలపరిమితి ముగిసినా ఇంకా కొనసాగుతుందని అన్నారు. అక్కడ తీవ్రమైన అపరిశుభ్రత నెలకొందని ఆస్పత్రి పాలనయంత్రాంగం సూపరింటెండెంట్ దృష్టికి తేగా, గడువు ముగిసినా గాంధీ ప్రాంగణంలో కొనసాగుతున్న వ్యాపార సముదాయాలపై న్యాయ పరమైన అంశాలపై ఉన్నతాధికారులు, న్యాయనిపుణుల సలహాలు, సూచనల మేరకు తగిన చర్యలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. త్వరలోనే మరోమారు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, పరిస్థితుల్లో మార్పులేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు.